క్లుప్తంగా...

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- అధికారులను ఆదేశించిన మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న మేయర్ కార్పొరేషన్ పరిధిలో పరిస్థితులపై చర్చించారు. బుధవారం రాత్రి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని మేయర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్లకు సమాచారం అందించాలని మేయర్ సూచించారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్

బోడుప్పల్: త్వరలో నిర్వహించే హరితహారానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు బోడుప్పల్ నగర పాలక సంస్థ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం లక్ష్మీనగర్, ఎన్‌బీఎన్ కాలనీ, మణికంఠ కాలనీ నర్సరీ, పార్కులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల్లో కలుపు లేకుండా చూడాలని హరిత మిత్రలను ఆదేశించారు. త్వరలోనే హరితహారం చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదివారం ఉప్పల్ నల్ల పోచమ్మ బోనాలు

ఉప్పల్: ఉప్పల్ ప్రజలు ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రావణ మాసంలో నిర్వహించే నల్ల పోచమ్మ బోనాల పండగను ఆదివారం జరపనున్నట్లు ఉప్పల్ పట్టణ పెద్దలు, మేకల శివారెడ్డి, దుబ్బ నర్సింహారెడ్డి, పోగుల దయాకర్‌రెడ్డి, నల్ల వీరారెడ్డి, మందముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. అమ్మవారి గుడి వద్ద ఏర్పాట్లు చకచకా జరుగుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నట్లు తెలిపారు.

ప్రీతంను కలిసిన మంద కృష్ణమాదిగ



ప్రీతంతో చర్చిస్తున్న మంద కృష్ణ మాదిగ

బోడుప్పల్: ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ బుధవారం చెంగిచర్ల వెంకటాద్రినగర్‌లో నివాసం ఉండే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం ఎస్సీసెల్ అధ్యక్షుడు నగరిగారి ప్రీతంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన విషయంపై చర్చించినట్లు ప్రీతం వెల్లడించారు. అనంతరం ప్రీతంను గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మహానీ, మాజీ ఎమ్మెల్యే దామోదర్‌రెడ్డి కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ భేటీలో దళితులకు సంబంధించిన వివిధ విషయాలపై చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించారు.

విరిగిన కరెంటు పోల్.. తెగిపడ్డ తీగలు

కుషాయిగూడ: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చక్రిపురం నుంచి చర్లపల్లి జైలుకు వెళ్లే మార్గంలో కరెంటు పోల్ విరిగి తీగలు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో అటువైపు వాహనదారులు ఎవరూ వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ట్రాన్స్‌కో అధికారులు కరెంటు సరఫరా నిలిపివేసి రోడ్డుపై తీగలను తొలగించారు. వర్షం కారణంగా రోడ్లపైకి వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన కరెంటు పోల్స్‌ను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చక్రిపురం- చర్లపల్లి జైలుకు వెళ్లే మార్గంలో..

సడక్‌పై.. దడదడ

- గ్రేటర్ శివారు ప్రాంతాల్లో చిత్తడే.. చిత్తడి
- పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితి అధ్వాన్నం
- వర్షాలతో ఛిద్రమైన రోడ్లు, నాలాలు
- పలు చెరువులు, నాలాల కబ్జాతో లోతట్టు కాలనీల్లోకి చేరుతున్న వరద



అత్వెల్లి రహదారి దుస్థితి

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు పట్టణాలు, గ్రామాల్లో వాన జల్లులతో రోడ్లు అస్తవ్యస్తంగా మారిపోయి గుంతలమయం కాగా, లోతట్టు కాలనీల్లోకి వరద చేరుతోంది. పలుచోట్ల డ్రైనేజీలు కాల్వలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో బస్తీ, పల్లెవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పలు రోడ్లు కూడా దెబ్బతిన్నాయి.

- ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలోని మేడిపల్లి నుంచి అన్నోజిగూడ బ్రిడ్జి వరకు జాప్యంగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనుల కారణంగా రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతోపాటు గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు, వ్యాపారవర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- చౌదరిగూడ, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచవాని సింగారంలోని అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి.
- నాగారం నుంచి కీసర ప్రధాన రోడ్డులో అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షపు జల్లులతో వరద నీరు పారుతుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- రాంపల్లి నుంచి బోగారం ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా మారింది. పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. రాంపల్లి నుంచి చర్లపల్లి ప్రధాన రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోయింది.
- గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ కాలనీ సహా పలు కాలనీల్లో రోడ్లన్నీ ఛిద్రంగా మారడంతో.. పట్టణ ప్రజలు పలు కష్టాలను ఎదుర్కొంటున్నారు.
- బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సాయినగర్, మల్లన్ననగర్, చెంగిచర్ల తదితర కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, దుండిగల్, ఘట్‌కేసర్, తూముకుంట, నిజాంపేట్ పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో కూడా రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, నాలాలు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. కీసర, శామీర్‌పేట్ మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాల్లో వర్షంతో రోడ్లు దెబ్బతినగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సహాయక చర్యలకు ఆదేశించగా, అప్రమత్తమైన పురపాలక, పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది రంగంలోకి దిగి మరమ్మతులు చేపడుతోంది.

నిధులు విడుదలైనా..

- బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లో గతంలో భారీగా కురిసిన వర్షాలతో తొమ్మిది కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతినగా.. డ్రైనేజీ కాల్వలతో సహా రోడ్ల పనులకు ప్రభుత్వం 18 నెలల క్రితం రూ.110 కోట్లు విడుదల చేయగా, సంబంధిత పురపాలక సంఘాలు నామమాత్రంగా పనులకు శ్రీకారం చుట్టడంతో పరిస్థితి ఎప్పటిలాగే ఉండగా, రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. దీంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మేడ్చల్ జిల్లాలోని పలు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో కూడా ఇదే అధ్వాన్న పరిస్థితి దాపురించింది.
- జిల్లాలోని పలు చెరువులు, కుంటలు, నాలాలకు సంబంధించిన స్థలాలు కబ్జాకు గురికావడంతో.. చిన్నపాటి వర్షాలకు కూడా సమీపంలోని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లు వరదమయంగా మారుతున్నాయి. చెరువులు, నాలాల్లోని అక్రమ నిర్మాణాల కారణంగా నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వాన్నంగా మారిపోయాయి. చెంగిచర్ల బస్సు డిపో వద్ద ఉన్న చెరువు కట్టను ధ్వంసం చేసి.. బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించడంతో సమీపంలోని కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నారపల్లిలో..



అల్వాల్ హిల్స్‌లో రోడ్డు

అధికారులూ.. అలసత్వం వీడండి



పాదయాత్రలో ఎమ్మెల్యేకు బేతి సుభాష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

- చర్లపల్లి డివిజన్‌లో రెండోరోజు ఎమ్మెల్యే పాదయాత్ర
- వర్షంలోనూ ఉత్సాహంగా సాగిన నమస్తే ఉప్పల్..

కుషాయిగూడ: అధికారులూ అలసత్వం వీడి పనితీరును మెరుగుపర్చుకోండి.. సమస్యలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపండి అంటూ ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పాదయాత్ర బుధవారం రెండోరోజు చర్లపల్లి డివిజన్‌లో కొనసాగింది. కుషాయిగూడ భజన మందిర్, శివసాయినగర్, మారుతీకాలనీ, టీచర్స్ కాలనీ, సీతారామకాలనీల్లో ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారులకు వివరిస్తూ.. చిన్న సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. మేజర్ సమస్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సోనియాగాంధీనగర్‌లో మూడు నెలలుగా నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ నిర్మాణంపై ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. నిర్మాణం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఈ, ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేందుకు ఎందుకు జంకుతున్నారంటూ ప్రశ్నించారు. ముఖ్యంగా డివిజన్‌లో డ్రైనేజీ, తాగునీటి లోప్రెషర్, విద్యుత్ సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చాయన్నారు. గుర్తించిన సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రకు ప్రజల నుంచి ఆదరణ వస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే తిరిగి బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు డప్పు గిరిబాబు, ప్రధాన కార్యదర్శి అనిల్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, గంప కృష్ణ, కడియాల బాబు, వినోద్, సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, ఇతర డివిజన్ల నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, కాసం మహిపాల్‌రెడ్డి, సుడుగు మహేందర్‌రెడ్డి, బాబు మాదిగ, శ్రవణ్‌గౌడ్, రంగు ప్రసాద్‌గౌడ్, భాగ్యమ్మ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

కాప్రా: ప్రస్తుతం నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి సూచించారు. రోడ్లపై వరద చేరిన ప్రాంతాల్లో వాహనదారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, పని ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డుల వద్ద మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం మాన్‌సూన్ బృందాలు ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలో బోనాల జాతర సందర్భంగా 3వ డివిజన్ సాయిఐశ్వర్య, సాయిప్రియ, సత్యనారాయణపురం కాలనీల్లో బీజేపీ కార్యకర్తగా బోనాల పండగ శుభాకాంక్షలు తెలుపుతూ తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా నాయకురాలిగా తమ ఎదుగుదలను చూచి ఓర్వలేక ఈ చర్యకు పాల్పడినట్లు ఆమె ఆరోపించారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ పిరికి చర్యలేమిటని ప్రశ్నించారు. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని ఆమె సవాల్ విసిరారు. అనంతరం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్వరలోనే అసలు దొంగలు బయటకొస్తారని అన్నారు.

దీన్‌దయాళ్‌నగర్‌లో నాలా సమస్యను పరిష్కరించాలి

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలో ఇబ్బందులకు గురవుతున్న నాలా సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్ యాదవ్ అధికారులను కోరారు. రూ.60 లక్షల నిధులు మంజూరయ్యాయని, అయినా దీనదయాళ్‌నగర్‌లో నాలా పనులు మొదలు పెట్టలేదన్నారు. పనులను ప్రారంభిస్తామని ఎన్నో నెలలు క్రితం నుంచి చెబుతున్నా ఇంతవరకు పనులను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలన్నారు. అదేవిధంగా సంతోషి మాత గుడి ముందు నుంచి డీమార్ట్ వరకు పైపు లైన్ వర్క్స్ పనులు చేపట్టాలని ఆమె కోరారు.


రైలు ఢీకొని విద్యార్థి మృతి

అల్వాల్: రైల్వే ట్రాక్ దాటుతుండగా దేవరయాంజల్‌కు చెందిన బచ్చల ప్రేమ్‌కుమార్(20) విద్యార్థి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. బొల్లారంలోని వందన డిగ్రీ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్న ప్రేమ్ కుమార్ అల్వాల్ స్టేషన్ వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా కాచిగూడ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టిందని తెలిపారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రేమ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యుత్ బకాల చెల్లింపులో ప్రభుత్వం విఫలం

డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: విద్యుత్ బకాల చెల్లింపులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. విద్యుత్ బకాయిల కారణంగా యాప్రాల్‌లోని మండల ప్రజాపరిషత్ పాఠశాలకు అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పాఠశాల విద్యార్థులు, సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ బుధవారం పాఠశాలకు వెళ్లి వారి ఇబ్బందులపై సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా తక్షణమే పునరుద్దరించాలని కోరారు. తక్షణ చెల్లింపుల నిమిత్తం నందికంటి శ్రీధర్ వారి మిత్ర బృందం చాకో, ఎస్‌వీఎస్ ప్రసాద్, వేణు, మధుసూదన్‌రెడ్డి, రమేష్, పాండు, సంతోష్, కే.శివనాయుడు, యశ్వంత్ యాదవ్, అమల్ కుమార్‌రెడ్డి, ధన్‌రాజ్ అందరూ కలిసి రూ.75 వేలను స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రాజలింగం, చంద్రశేఖర్, బాలరాజు, ప్రవీణ్‌కుమార్, మండల సతీష్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయురాలికి బిల్లు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. 3వ డివిజన్‌లోని కృష్ణనగర్‌లో రూ.33.50 లక్షలతో డ్రైనేజీ పనులకు, 24వ డివిజన్‌లో రూ.40 లక్షల వ్యయంతో వీరారెడ్డినగర్ చౌరస్తా, అంబేడ్కర్‌నగర్ చౌరస్తా వరకు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ బోడుప్పల్ నగర పాలక సంస్థలో మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రధాన రహదారులకు నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, గుర్రాల రమవెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం



కాప్రా నేతాజీనగర్‌లో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నేతల ఆత్మీయ సమ్మేళనం

కాప్రా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారుల ఉప్పల్ జేఏసీ నేతలు బుధవారం కాప్రా నేతాజీనగర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిది ఏళ్లు పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా నాటి పోరాట పటిమను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉప్పల్ జేఏసీ తరఫున నియోజకవర్గంలో వివిధ హోదాల్లో ఉద్యమించినట్లు వివరించారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యమకారులంతా ఎవరికి నచ్చిన పార్టీలోకి వారు వెళ్లిపోయారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం పదో ఏట అడుగుపెట్టిన సందర్భంగా కాప్రా జేఏసీ చైర్మన్ ఏనుగు సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేష్‌కుమార్, వణిందర్, విద్యాసాగర్, లక్ష్మణ్, రవీందర్, కిషన్, చిన్న, చంద్రశేఖర్, భైరి భాస్కర్‌గౌడ్, రాము, తాడూరి గగన్‌కుమార్, వెంకట్‌చారి, పవన్, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సిద్దిరాములు, నర్సింహులు, మల్లేష్, ధర్మారెడ్డి, నర్సింహారెడ్డి, శివ, నరేష్, జగదీష్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ స్టడీటూర్‌కు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి



మేడిపల్లి: స్టడీటూర్‌లో భాగంగా పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి బుధవారం ఉదయం బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఏఎస్‌సీఐ) ఆధ్వర్యంలో స్వచ్ఛసర్వేక్షణ్‌పై ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు స్టడీ టూర్‌లో భాగంగా బంగ్లాదేశ్‌లోని వివిధ పట్టణాల్లో మేయర్ పర్యటించనున్నారు. నాలుగు రోజుల స్టడీ టూర్ ముగిసిన అనంతరం మేయర్ ప్రజలకు అందుబాటులో ఉంటారని మేయర్ వెంకట్‌రెడ్డి కార్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్‌బీఎన్ కాలనీకి బస్సు పున:ప్రారంభం



బోడుప్పల్: బోడుప్పల్ 5వ డివిజన్ భీమ్‌రెడ్డి కాలనీ, ఎన్‌బీఎన్ కాలనీ, బీసీటీ కాలనీకి కోఠి నుంచి వచ్చే 115ఎన్ టీఎస్ ఆర్టీసీ బస్ సర్వీసులను బుధవారం నుంచి పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి, టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కార్పొరేటర్ పద్మారెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ముత్యాలుకు రూ.2 లక్షల ఎల్‌ఓసీ అందజేస్తున్న మాజీ మేయర్ బొంతు రాంమోహన్ తదితరులు

కుషాయిగూడ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్ అన్నారు. చర్లపల్లి డివిజన్ ఐజీ కాలనీ అధ్యక్షుడు ముత్యాలు కుమారుడు వంశీకృష్ణ అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం రూ.2 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మాజీ మేయర్ బొంతు రాంమోహన్, బొంతు శ్రీదేవి దంపతులను సంప్రదించి విషయం తెలియజేయడంతో స్పందించిన వారు సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ పత్రాన్ని బుధవారం క్యాంపు కార్యాలయంలో అందజేశాడు. నాగిళ్ల బాల్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, గణేష్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: పక్షవాతంతో బాధపడుతున్న ఓ బాధితుడికి బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి. ఎల్లారెడ్డిగూడకు చెందిన పురోహితుడు శేషాచార్యులు రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న లక్ష్మారెడ్డి బుధవారం తన కార్యాలయంలో అతడికి ఆర్థిక సాయం అందించారు. ఉప్పల్ నియోజకవర్గంలో పేదల కోసం తన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు భైరి నవీన్‌గౌడ్, ఇంద్రయ్య, ఇందిరాగౌడ్ పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపేందుకు కృషి



కుషాయిగూడ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



కాప్రా భాస్కర్‌రావునగర్‌లో నిలిచిన వరదను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కుషాయిగూడ: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తెలిపారు. బుధవారం ఆమె కుషాయిగూడ వెంకటేశ్వరస్వామి ఆలయం పక్క వీధిలో పర్యటించారు. మ్యాన్‌హోల్‌పై ధ్వంసమై ప్రమాదకరంగా మారిందని, రోడ్డుకు అడ్డుగా కరెంటు పోల్స్ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. కరెంటు పోల్స్‌ను కూడా మార్చాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. స్థానిక సమస్యలను తనను దృష్టికి తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి

కాప్రా: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కాప్రా డివిజన్‌లో సమస్యలు తలెత్తితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి కోరారు. భాస్కర్‌రావునగర్‌లో వరద నిలిచి తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ కాలనీకి చేరుకుని పరిశీలించారు. వెంటనే మాన్‌సూన్ బృందాలను పిలిపించి సమస్యను పరిష్కరించారు. మాన్‌సూన్ బృందాలు, శానిటేషన్, ఎలక్ట్రిసిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డివిజన్‌లో ఎక్కడ ఎలాంటి సమస్య అయినా తక్షణమే స్పందించాలని ఆదేశించారు.